తిరుపతి - చిత్తూరు
తెలుగు జాతీయ దినపత్రిక వార్త

## వెంకన్న సుప్రభాతసేవలో ప్రభుత్వ సిఎస్ డాక్టర్ జవహర్‌రెడ్డి

తిరుమల, జులై 16(ప్రభాతవార్తప్రతినిధి:



రాష్ట్రప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డాక్టర్ కెఎస్ జవహర్‌రెడ్డి ఆదివారం వేకువజామున తిరుమలేశుని సుప్రభాత సేవలో దర్శించుకున్నారు. టిటిడి ఇఒ ఏవి ధర్మారెడ్డి, ఆలయ డిప్యూటీ ఇఒ లోకనాథం, వసతికల్పన విభాగం డిప్యూటీ ఇఒ పి.హరీంధ్ర నాథ్ దర్శన ఏర్పాట్లుచేసి, స్వామివారి తీర్థప్రసాదాలు అందజేశారు.

# శ్రీవారిమెట్టుమార్గంలో దుకాణాల్లో అధిక ధరలు

## అందరూ ఉంటేనే లడ్డూలిస్తామంటున్నారు 'డయల్ యువర్ ఇఓ'కు భక్తుల ఫిర్యాదు



తిరుమల, జులై 16ప్రభాతవార్తప్రతినిధి:

ఇష్టదైవమ్ శ్రీవేంకటేశ్వరస్వామి దర్శనార్థమ్ శ్రీవారిమెట్టుమార్గంలో కాలినడక నడచివచ్చేభక్తులకు దుకాణాల వద్ద అల్పాహారం అధిక ధరలు వసూలుచేస్తున్నారని, దీన్ని నియంత్రించాలని ఐరాలకు చెందిన ఈశ్వర్‌ప్రసాద్ ఫిర్యాదు చేశారు. దుకాణాదారులు భక్తులతో నోటికివచ్చినట్లు మాట్లాడుతున్నారని, అడిగితే ఇష్టానుసారం ప్రశ్నలువేస్తున్నారన్నారు. భక్తులు దోపిడీకి గురికాకుండా చూడాలని కోరారు. ఈ ప్రశ్నకు టిటిడి ఇఒ ఏవి ధర్మారెడ్డి సమాధనమిస్తూ అధిక ధరలు వసూలుచేస్తున్న దుకాణాలపై చర్యలు తీసుకుంటామని, శ్రీవారిమెట్టు మార్గంలో మొదట్లో అన్నప్రసాదాలు అందించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. పలమనేరునుంచి మణికంఠ మాట్లాడుతూ కుటుంబంతో కలసి ఇటీవల స్వామివారి దర్శనానికి వచ్చామని, ఆలయంలోపల దేవుని దర్శనం బాగా జరిగింది. లడ్డూలకోసం వితరణశాల కౌంటర్లవద్దకెళితే కుటుంబసభ్యులు అందరూ వస్తేనే లడ్డూలు ఇస్తామని లేకుంటే ఇవ్వడంలేదని తెలిపారు. ఇందుకు ఇఒ స్పందిస్తూ లడ్డూలకోసం దళారులను అరికట్టేందుకు ఈ నిర్ణయం తీసుకున్నాం. భక్తులు కూడా సహకరించాలని కోరారు. ఆదివారం ఉదయం అన్నమయ్యభవనంలో "డయల్ యువర్ ఇఒ"కార్యక్రమం జరిగింది. గంటపాటు సాగిన ఈ కార్యక్రమానికి దేశం నలుమూలల నుంచి 23మంది భక్తులు ఫోన్‌ద్వారా తమ సమస్యలు, సూచనలు, ఫిర్యాదులు ఇఒ ధర్మారెడ్డికి తెలిపారు. హైదరాబాద్‌నుంచి వెంకటరమణమూర్తి మాట్లాడుతూ ఎన్‌ఆర్ఐ భక్తులు దర్శన టిక్కెట్ కోసం ప్రయత్నిస్తే ఇవ్వలేదన్నారు. దీనిపై ఇఒ స్పందిస్తూ ఎన్‌ఆర్ఐలు తిరుమలలో తమ అర్హతను చూపితే 300 రూపాయలు దర్శన టిక్కెట్ జారీచేసి స్వామివారి దర్శనం కల్పిస్తున్నామని తెలిపారు. విశాఖనుంచి శ్రీరామ్ మాట్లాడుతూ వికలాంగులను, వృద్ధులను వేర్వేరుగా ప్రత్యేక దర్శనంలో పంపితే బావుంటుందని కోరారు. ఇందుకు సమాధానంగా వీలైనంత వరకు అలాగే పంపడానికి చూస్తామని ఇఒ తెలిపారు. కర్నూలునుంచి రతీదేవి మాట్లాడుతూ శ్రీవారిసేవకులకు సేవాసదన్‌లోనే అన్నప్రసాదాలు అందిస్తే బావుంటుందని కోరారు. దీనిపై స్పందించిన ఇఒ అన్నప్రసాద భవనంలో ప్రత్యేక హాలు కేటాయించి శ్రీవారిసేవకులకు అన్నప్రసాదాలు అందిస్తున్నామని, సేవాసదన్‌లో అందించే విషయం పరిశీలిస్తామన్నారు. తిరుమల నడకమార్గాల్లో భక్తులను అలిపిరి నుండి రాత్రి 7గంటల తరువాత గాలిగోపురం వద్దనుంచి మోకాళ్ళపర్వతం వరకు భక్తును గుంపులుగాపంపేలా చూస్తున్నామన్నారు. శ్రీవారి మెట్టుమార్గంలో సాయంత్రం 6గంటలకే అనుమతనిస్తున్నామన్నారు. అలిపిరి మార్గంలో రాత్రి 10గంటల వరకే భక్తులను అనుమతినిస్తున్నామని ఇఒ ధర్మారెడ్డి వెల్లడించారు. తిరుమలకు నడిచే ఆర్టీసి బస్సుల్లోని చెత్తబుట్టల్లో చెత్తను పడేయాలని సూచించారు. తిరుమలలో లోకక్షేమం కోసం అనేక కార్యక్రమాలు చేపడుతున్నామని, ఇప్పటికే చేపట్టి ప్రపంచంలోని మానవాళి ఆయురారోగ్యానికి ప్రత్యేక పారాయణాలు చేస్తున్నామన్నారు. టిటిడి విద్యాసంస్థల్లో మంచి పోషకాహారం అందించడానికి స్వయంగా మధ్యాహ్న భోజన కార్యక్రమాన్ని ప్రారంభించి, రోజుకు 3వేలమంది విద్యార్థులకు మధ్యాహ్న భోజనం అందిస్తున్నామన్నారు. శ్రీవాణి ట్రస్టు నిధులు దుర్వినియోగమయ్యాయని ఇటీవల కొంతమంది దుష్ప్రచారం చేశారని, ఇలాంటి ప్రచారాన్ని భక్తులు నమ్మవద్దనిఇ ఇఒ విజ్ఞప్తి చేశారు. తిరుపతిలోని మంచినీళ్ళగుంటను అభివృద్ధిచేసి గోవిందరాజస్వామి విగ్రహాన్ని ప్రజలు చూసే అవకాశం కల్పిస్తామన్నారు. జన్మ, మృత్యు రహస్యాలు ,మానవశరీరాన్ని నడిపించే శక్తికి సంబంధించిన అదీంద్రియ విజ్ఞానంపై ఎస్వీ వేదవిశ్వవిద్యాలయంలో ప్రత్యేకంగా ఒక విభాగాన్ని ఏర్పాటుచేయడానికి చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఇది ప్రజలకు ఎంతో ఉపయోగపడుతుందని ఇఒ ధర్మారెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో టిటిడి జెఇఒలు సదాభార్గవి, వీరబ్రహ్మం, సిఇ నాగేశ్వరరావు, ఎస్ఇ జగదీశ్వర్‌రెడ్డి, ఎస్వీబిసి సిఇఒ షణ్ముఖకుమార్, డిప్యూటీ ఇఒలు భాస్కర్, శెల్వం, విజిఒ గిరిధర్, ఆరోగ్యఅధికారిణి డాక్టర్ శ్రీదేవి, ఉద్యానవనవిభాగం సూపరింటెండెంట్ శ్రీనివాసులు ,రవాణా జిఎం శేషారెడ్డి, ఐటి జిఎం సందీప్‌రెడ్డి, పిఆర్ఓ డాక్టర్‌తలారి రవి, ఏపిఆర్ఓ నీలిమ తదితరులు పాల్గొన్నారు.

### సూళ్లూరుపేట పోలీస్‌స్టేషన్‌లో

# ఉద్రిక్తత

## బైఠాయించిన మున్సిపల్ ఛైర్‌పర్సన్ శ్రీమంత్‌రెడ్డి - నాలుగు గంటల పాటు కొనసాగిన హైడ్రామా



స్టేషన్‌కు తరలివస్తున్న ఛైర్‌పర్సన్ శ్రీమంత్‌రెడ్డి



బాధితుడు కళత్తూరు సునీల్‌రెడ్డి

సూళ్లూరుపేట, జూలై 16 ప్రభాతవార్త

సూళ్లూరుపేట పట్టణంలోని పోలీసుస్టేషన్‌లో ఆదివారం హైడ్రామా చోటుచేసుకుంది. నాలుగు గంటల పాటు ఉద్రిక్త వాతావరణం నెలకొంది. వివరాలిలా ఉన్నాయి. అధికార పార్టీకి చెందిన మున్సిపల్ కోఆప్షన్ సభ్యుడు కళత్తూరు సునీల్‌రెడ్డిని రౌడీషీటర్లకు కౌన్సిలింగ్ పేరుతో పోలీసుస్టేషన్‌కు పిలిపించి అక్రమంగా నిర్బంధించారన్న కారణంతో ఒక వర్గానికి చెందిన వైసీపీ నేతలు పోలీసుస్టేషన్‌ను ముట్టడించడంతో పాటు అక్కడే బైఠాయించి నిరసన వ్యక్తం చేశారు. ఇటీవల కోఆప్షన్ సభ్యుడు కళత్తూరు సునీల్‌రెడ్డి ప్రెస్‌మీట్ పెట్టి ఎస్ఐపై ఆరోపణలు చేయడం తెలిసిందే. ఈ నేపథ్యంలో రౌడీషీటర్లకు కౌన్సిలింగ్ పేరిట సునీల్‌రెడ్డిని పోలీసుస్టేషన్‌కు పిలిపించారు. అక్కడ ఎస్ఐ రవిబాబుకు, సునీల్‌రెడ్డికి వాగ్వివాదం చోటుచేసుకుంది. దీంతో అతన్ని పోలీసుస్టేషన్‌లోనే నిర్బంధించారు. ఈ సమాచారం అందడంతో వైసీపీ పట్టణ అధ్యక్షుడు కళత్తూరు శేఖర్‌రెడ్డి పోలీసుస్టేషన్‌కు చేరుకొని ఎస్ఐతో సునీల్‌రెడ్డిని ఎందుకు నిర్బంధించారని ప్రశ్నించారు. ఇందుకు తనపై దౌర్జన్యం చేశారని, దుర్భాషలాడాడంటూ సమాధానం ఎస్ఐ గట్టిగా చెప్పారు. ఈవిషయంలో పట్టణంలో దావానలంగా వ్యాపించడంతో వైసీపీ కార్యకర్తలు పెద్దఎత్తున పోలీసుస్టేషన్‌కు చేరుకున్నారు. ఒక దశలో వైసీపీ నేతలకు, ఎస్ఐకి ఈ విషయమై వాగ్వివాదం చోటుచేసుకుంది. పోలీసుస్టేషన్‌కు వస్తున్న ప్రజలను చూసి తడ, దొరవారిసత్రం, శ్రీహరికోట ఎస్ఐలను, అదనపు సిబ్బందిని తీసుకొచ్చారు. దీంతో నాయుడుపేట ప్రస్తుత ఇన్‌ఛార్జి సిఐ నరసింహరావు సూళ్లూరుపేటకు చేరుకున్నారు. అక్కడి నుంచి సుమారు రెండుగంటల పాటు కార్యకర్తలు స్టేషన్ వెలుపల పోలీసులకు వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ సునీల్‌రెడ్డిని విడిచిపెట్టాలని కోరారు. ఈ నేపథ్యంలో మున్సిపల్ ఛైర్‌పర్సన్ దబ్బల శ్రీమంత్‌రెడ్డి పోలీసుస్టేషన్‌కు చేరుకొని బైఠాయించారు. సీఐ నరసింహారావు, ఎస్ఐలు ఎంత సేపు బ్రతిమిలాడి సర్దిచెప్పినప్పటికీ శ్రీమంత్‌రెడ్డి స్టేషన్ వద్ద బైఠాయించి తమకు న్యాయం చేయాలని, అక్రమంగా నిర్బంధించిన సునీల్‌రెడ్డిని వదిలిపెట్టాలని డిమాండ్ చేశారు. ఒక దశలో సహనాన్ని కోల్పోయి శ్రీమంత్‌రెడ్డి రోదించారు. పోలీసులు ఎట్టకేలకు సర్దిచెప్పి అక్కడి నుంచి శ్రీమంత్‌రెడ్డిని పైకిలేపి రాజీ చర్చలు ప్రారంభించారు. అనంతరం కళత్తూరు సునీల్‌రెడ్డిని వదిలిపెట్టారు. ఈ సందర్భంగా సునీల్‌రెడ్డి మాట్లాడుతూ తనపై ఎస్ఐ రవిబాబు వ్యక్తిగతంగా కక్ష పెంచుకొని అనవసరంగా పోలీసుస్టేషన్‌లో కొట్టడంతో పాటు తన మెడకు బెల్టు వేసి చంపేందుకు కూడా ప్రయత్నించాడని ఆరోపించారు. సూళ్లూరుపేట పట్టణంలో శాంతిభద్రతలు కరవయ్యాయని, ఎస్ఐ వల్ల ఇద్దరు ముగ్గురు ప్రాణాలు కోల్పోయారని, ఆయన అక్రమ సంపాదనే ధ్యేయంగా పనిచేస్తున్నాడని ఆరోపించారు. ఛైర్‌పర్సన్ శ్రీమంత్‌రెడ్డి మాట్లాడుతూ పోలీసులు ఏకపక్షంగా వ్యవహరిస్తున్నారని, అధికారపక్షంపైనే వారు గురిపెడుతున్నారని ఆరోపించారు. గతంలో బాబురెడ్డిపై దాడి చేయడం, ప్రస్తుతం సునీల్‌పై దాడి చేయడం వంటి అంశాలు చోటుచేసుకోవడం దురదృష్టకరమన్నారు. తెలుగుదేశానికి చెందిన వారికే పోలీసుస్టేషన్‌లో పనులు అవుతున్నాయంటూ గట్టిగా చెప్పారు. మొత్తంమీద నాలుగు గంటల పాటు నడిచిన హైడ్రామా సుఖాంతమైంది. ఈ విషయం పట్టణంలో చర్చనీయాంశంగా మారింది.

# చంద్రయాన్-3 అద్భుత దృశ్యాలు

## ఆకట్టుకుంటున్న వీడియోలు




చంద్రయాన్-3 ఉపగ్రహం అంతరిక్షంలో దిగుతున్న దృశ్యం

శ్రీహరికోట (తడ), జూలై 16 ప్రభాతవార్త

అంతరిక్షంలో అద్భుతం ఇది. చంద్రయాన్-3పై ప్రపంచ వ్యాప్తంగా విస్తృత ప్రచారం జరిగిన నేపథ్యంలో ఈ ఉపగ్రహాన్ని మోసుకెళ్లిన మన బాహుబలి రాకెట్ ఎల్‌విఎం3-ఎం4 పనితనం కూడా ఇస్రో వారు తీసిన వీడియోల ద్వారా బయటపడింది. గతంలో ఎన్నడూ లేనివిధంగా ఈ అతిపెద్ద రాకెట్‌లో బూస్టర్లు విడిపోతున్న దృశ్యాలు 16 నిమిషాలకు పైగా ప్రయాణించిన రాకెట్ నుంచి చంద్రయాన్-3 అంతరిక్షంలో దిగినప్పుడు తీసిన దృశ్యాలు అమితాసక్తిని కలిగిస్తున్నాయి. ఆదివారం ఈ వీడియో ప్రసార మాధ్యమాల్లో వైరల్ అయ్యింది. రాకెట్‌లో పొందుపరిచిన ఆన్‌బోర్డు కెమెరా పనితీరును పలువురు ప్రశంసిస్తున్నారు.




ఎల్‌విఎం3-ఎం4 రాకెట్ నుంచి విడిపోతున్న స్ట్రాపాన్ బూస్టర్లు

### నారాయణ గురుకుల్ ట్రస్టు సారధ్యంలో

# గురుకులం ఏర్పాటుకు స్థల పరిశీలన

### రెండు రోజులుగా పుణ్యక్షేత్రాల్లో సాధువులు



వికృతమాల వద్ద స్థల పరిశీలన జరుపుతున్న సాధువులు

శ్రీకాళహస్తి, జూలై 16 ప్రభాతవార్త

శ్రీకాళహస్తి పుణ్యక్షేత్రంలోని ఏర్పేడు మండలం వికృతమాల వద్ద జాతీయ స్థాయిలో పేరొందిన స్వామి నారాయణ గురుకుల్ ట్రస్టు సారధ్యంలో ఏర్పాటు చేయనున్న గురుకులం ఏర్పాటుకు సంబంధించిన ఏర్పాట్లు చక చకా సాగుతున్నాయి. మాజీ కేంద్ర మంత్రి జలగం ప్రసాద్‌రావు సారథ్యంలో ఈ ఏర్పాటు జరుగుతుంది. ఈ నేపథ్యంలో రెండు రోజులుగా ట్రస్టుకు సంబంధించిన సాధువులు పుణ్యక్షేత్రాలైన శ్రీకాళహస్తి, తిరుమలలో దర్శనాల్లో నిమగ్నమయ్యారు. వారికి ఏర్పాట్లను స్థానిక శాసనసభ్యుడు బియ్యపు మధుసూధనరెడ్డి దగ్గరుండి పర్యవేక్షిస్తున్నారు. శనివారం రాత్రి శ్రీకాళహస్తీశ్వరుని సన్నిధిలో స్వామి అమ్మవార్ల సేవల్లో పాల్గొన్న సాధువులు ఆదివారం తిరుమలేశుని దర్శించుకున్నారు. ప్రధాన స్వామిజీ మహంతు సాధు దేవప్రసాద్ దాస్ స్వామి సారథ్యంలో వారిశిష్య బృందం హాజరయ్యారు. స్వాములతో టిటిడిఇఓ ధర్మారెడ్డి చర్చించారు.

**మూడు చోట్ల గురుకులాలు**

శ్రీకాళహస్తి నియోజకవర్గం ఏర్పేడు మండలంలోని విమానాశ్రయంకు సమీపంలో వికృత మాల వద్ద 15 ఎకరాల స్థలంలో గురుకులం ఏర్పాటు చేయనున్నారు. మాజీ కేంద్ర మంత్రి జలగం ప్రసాద్‌రావు చొరవ తీసుకొని ఆంధ్ర రాష్ట్రంలో కేంద్ర విద్యాసంస్థలను ఏర్పాటుకు ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డితో చర్చించారు. ఆయన తన సొంత నియోజకవర్గం పులివెందులలో కూడా ఒకటి ఏర్పాటు చేయాలని కోరగా వెంటనే ట్రస్టు ఆమోదించినట్లు తెలిసింది. రాష్ట్రంలోని విశాఖ పట్టణం, పులివెందుల, శ్రీకాళహస్తి నియో జక వర్గంలోని వికృతమాల వద్ద ఒక్కొక్క చోట 15 ఎకరాల స్థలాన్ని ప్రభుత్వం మంజూరు చేసింది. ఈ నేపథ్యంలో ముఖ్యమంత్రి భూమి పూజ చేయటానికి సన్నాహాలు జరుగుతున్నాయి.

**స్థల పరిశీలన:**

శ్రీకాళహస్తి నియోజకవర్గంలోని ఏర్పేడు మండలం వికృతమాల గ్రామం వద్ద ఏర్పాటు చేయనున్న గురుకులం స్థలాన్ని ట్రస్టుకు సంబంధించిన సాధువులు శుక్ల వల్లభదాస్, సాధు నిత్యస్వరూపాదాస్, రెడ్డి శేఖర్ లక్కమనేని కృష్ణ, చక్రి తదితరులు ఎంఎల్‌ఏతో పాటు పాల్గొన్నారు.

పలుకుబడి ఉంటే అభిషేకానికి అనుమతి!
ఏడుకొండవాడికి ఏడవనెలలో ఏడుగంటలపాటు నృత్యనీరాజనం
సీఎం సభను విజయవంతం చేయండి
కాణిపాకంలో భక్తుల రద్దీ రద్దీ
4లో

# చెరువులో బోల్తాపడ్డ ట్రాక్టర్

## ముగ్గురికి తీవ్రగాయాలు



పెద్దపంజాణి, జూలై 16 ప్రభాతవార్త :

పెద్దపంజాణి మండలం కొలత్తూరు గ్రామ సమీపంలోని చెరువుకట్టవద్ద ఆదివారం ప్రమాదవశాత్తు ఒక ట్రాక్టర్ బోల్తాపడి చెరువులోపడింది. అయితే స్థానికులు ఇది గమనించి సహాయకచర్యలు చేపట్టడంతో పెద్దపెనుప్రమాదం తప్పింది. దీంతో ట్రాక్టర్‌లోని ప్రయాణికులు ఊపిరి పీల్చుకున్నారు. ఈ సంఘటనకు సంబంధించి స్థానికులు కథనం మేరకువివరాలిలా.. పలమనేరు మండలం టి.వడ్డూరుకు చెందిన సిద్దప్ప కుమారుడు అంజి (20)అతని భార్యలక్ష్మీదేవి, పీలేరుకు చెందిన హరిబాబుతో పాటు మరో ఇద్దరు ఆడపిల్లలు, ఇద్దరు మహిళలు మామిడికాయలు కోసే పనినిమిత్తం ట్రాక్టర్లో బయలుదేరారు. అయితే మార్గ మధ్యంలో కొలత్తూరు చెరువువద్ద ట్రాక్టర్ ప్రమాదవశాత్తు అదుపుతప్పి బోల్తాపడింది. ఈ ప్రమాదంలో అంజి, లక్ష్మీదేవమ్మ, హరిబాబుకు తీవ్రగాయాలయ్యాయి. అనంతరం సంఘటనాస్థలానికి చేరుకున్న గ్రామస్తులు సహాయక చర్యలు చేపట్టి ట్రాక్టర్‌ను కొంచెం గట్టుకులాగి ట్రాక్టర్‌లోని వారి ప్రాణాలను కాపాడారు. గాయపడ్డవారిని 108 అంబులెన్స్‌లో పలమనేరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కాగా ఈ ప్రమాదంలో స్వల్పగాయాలతో బాధితులు బయటపడటంతో పెను ప్రమాదం తప్పింది.



ప్రమాదంలో గాయపడిన వారిని 108లోఆసుపత్రికి తరలిస్తున్న దృశ్యం.

# 3 ప్రాంతాల్లో 19 ఎర్రచందనం దుంగలు స్వాధీనం

## 20 మంది తమిళ స్మగ్లర్లు అరెస్టు



తిరుపతి కార్పొరేషన్, జులై 16, ప్రభాతవార్త

రాజంపేట, తిరుపతి జిల్లాల్లోని మూడు ప్రాంతాల్లో 19 ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకోవడంతో పాటు, 20 మంది స్మగ్లర్లను టాస్క్‌ఫోర్సు పోలీసులు అరెస్టు చేశారు. వారి నుంచి ఒక మోటారు సైకిల్ స్వాధీనం చేసుకున్నట్లు టాస్క్‌ఫోర్సు డీఎస్పీ మురళీధర్ తెలిపారు. ఆయన ఆదివారం విలేకరులతో మాట్లాడుతూ తమ హెచ్ఓడీ, కర్నూలు రేంజి డీఐజీ సెంథిల్ కుమార్ ఆదేశాల మేరకు ఆర్ఐ కె. సురేష్ కుమార్ రెడ్డికి చెందిన మూడు ఆర్‌ఎస్ఐలు సురేష్ బాబు, వై. విశ్వనాథ్, కేఎస్కే లింగాధర్ టీమ్‌లు తిరుపతి టాస్క్ ఫోర్సు కార్యాలయం నుంచి మూడు ప్రాంతాలకు కూంబింగ్ చేపట్టారు. ఒక టీమ్ అన్నమయ్య జిల్లా తుమ్మలబైలు సెక్షన్ చాకిరేవు కోసం సమీపంలో అటవీ ప్రాంతంలో కూంబింగ్ చేపట్టారు. మరో టీమ్ అన్నమయ్య జిల్లా సానిపాయ రేంజి ఫింఛా సెక్షన్ సెక్షన్ దిన్నెల ఫారెస్టు బీటు, చిట్టికురవ రాస్తా కోన సమీపంలోని నిషేదిత అటవీ ప్రాంతానికి వెళ్లారు. ఇంకో టీమ్ తిరుపతి జిల్లా నాగపట్ల సెక్షన్‌లోని తిరుపతి పిలేరు రోడ్డులో గల వెంకట పద్మావతి ఇనిస్టిట్యూట్ కళాశాల ఎదురుగా ఉన్న అటవీ ప్రాంతంలో కూంబింగ్ చేపట్టారు. ఆ ప్రాంతంలో కొందరు వ్యక్తులు ఎర్రచందనం దుంగలను మోసుకుని వస్తూ కనిపించారు. వారిని మూడు వైపుల నుంచి టాస్క్‌ఫోర్సు టీమ్‌లు చుట్టుముట్టే అరెస్టు చేయగలిగారు. వీరు మొత్తం 20 మంది ఉండగా వారిలో తమిళనాడు వేలూరు జిల్లా ఆనైకట్టు తాలూకాకు చెందిన రమేష్ (42), సురేష్ సాంబశివం (38), నవీన్ వెంకటేషన్ (23), సెంగోదరన్ మునిస్వామి (29), తిరువన్నామలై జమునామత్తూరుకు చెందిన కొళంధై చిన్నపయ్యన్ (50), కల్లకురిచ్చి జిల్లాకు చెందిన ఏలుమలై (33), సామికన్ను పచ్చయ్యన్ (37), గణేశన్ పిచ్చన్ (28), అనంతరామన్ (19) అన్బు పచ్చన్ (40), అళగేషన్ కుమారస్వామి (36), సెంథిల్ రామన్ (30), తిరుపత్తూరు జిల్లాకు చెందిన వెంకటేశన్ కాళి (34) రంగనాథన్ పెరుమాళ్ (39) అదే జిల్లా ఆంబూరు తాలుకాకు చెందిన మురళి మురుగన్ (24), ఎల్లియన్ (57), వేలు రత్నం (36), ముత్తురామన్ చిన్నపయ్యన్ (40), దామోదరం రాజా (46), సత్యవేలు రత్నం (27)లుగా గుర్తించినట్లు తెలిపారు. వీరిని అరెస్టు చేసి టాస్క్ ఫోర్సు పోలీసు స్టేషన్‌కు తరలించారు. ఈ కేసులను సిఐ శ్రీనివాసులు, ఎస్ఐ చెరుకూరి షఫీ నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు. మరికొంతమంది అడవుల్లో ఉన్నారని సమాచారం అందుకోవడంతో మరికొన్ని బలగాలు అడవిలో కూంబింగ్ చేపడుతున్నాయని తెలిపారు. ఎర్రచందనం దుంగల విలువ రూ. 50 లక్షల వరకు ఉంటుందని అంచనా వేశారు. కడప పరిధిలో మరో 32 ఎర్రచందనం దుంగలు స్వాధీనం చేసుకుని ఏడుగురు అరెస్టు చేసినట్లు డిఎస్పి మురళీధర్ తెలిపారు. ఆర్ఐ చిరంజీవులుకు చెందిన రెండు టీమ్‌లు శుక్రవారం నుంచి కూంబింగ్ చేపడుతున్నారు. ఆర్‌ఎస్ఐ నరేష్‌కు చెందిన టీమ్ గోపవరం పిపికుంట రిజర్వు ఫారెస్టులో కూంబింగ్ నిర్వహిస్తుండగా, బ్రాహ్మణపల్లి వద్ద ఎర్రచందనం దుంగలు మోసుకుని వెళుతున్న వ్యక్తులను గమనించి వారిని చుట్టుముట్టే ప్రయత్నం చేసారు. వారిలో ముగ్గురిని అరెస్టు చేయగా, వారిని కడప జిల్లా గోపవరం మండలం పిపి కుంటకు చెందిన శివ (40), ఓబులేసు (60), చెన్నయ్య (55)లుగా గుర్తించి వారి నుంచి 19 ఎర్రచందనందుంగలను స్వాధీనం చేసుకున్నట్లు డిఎస్పి తెలిపారు. మరో ఆర్‌ఎస్ఐ రాఘవేంద్ర టీమ్ చింతలకుంట ఫారెస్టు బీటులోని బీడిబావి సెక్షన్‌లో కూంబింగ్‌చేస్తుండగా, కొందరు వ్యక్తులు ఎర్రచందనం దుంగలను మోసుకుని వెళుతూ కనిపించారు. వీరిని చుట్టుముట్టగా వారిలో నలుగురిని పట్టుకున్నారు. వారిని అన్నమయ్య జిల్లా నందలూరు మండలానికి చెందిన కనకదుర్గయ్య (51), నరసింహులు (43), రాజంపేట మండలం పి. వెంకటేశు (35), కోడూరు మండల పరుశురాం (35)లుగా గుర్తించారు. వీరి నుండి 13 ఎర్రచందనం దుంగలు, ఒక మోటారు సైకిల్ స్వాధీనం చేసుకున్నారు. వీటి విలువ కూడా రూ. 30 లక్షల వరకు ఉండవచ్చునని డిఎస్పి తెలిపారు.

# తవణంపల్లెలో ఘనంగా పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

## -42 ఏళ్ల తరువాత కలిసిన స్నేహబంధం

తవణంపల్లె, జూలై 16 ప్రభాతవార్త:
ప్రతి ఒక్కరి జీవితంలో గుర్తుండే తీపి జ్ఞాపకాలు చిన్నతనంలోనే వుంటాయి. తను చదువుకునే రోజులు...చేసే అల్లరి, చిలిపి పనులు...వారితో కలసి ఆడిన ఆటలు...అవన్నీ మధురమైన క్షణాలు. మళ్ళీ అవన్నీ గుర్తు చేసుకుంటూ 42 ఏళ్ల తరువాత ఆదివారం కలుసుకుని ఆనందంగా గడిపారు మండలంలోని తవణంపల్లె జడ్పీ ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థులు. 1981-82 బ్యాచ్ పదవ తరగతి చదువుకున్న పూర్వ విద్యార్థులు 42 ఏళ్ల తరువాత తాము చదువుకున్న పాఠశాలలో కలుసుకున్నారు. ఆబ్యాచ్‌కు చెందిన విద్యార్థులు ఎంసీ.బాబురెడ్డి, జెట్టిపల్లె శ్రీనివాసులు, రాంకుమార్, సిద్దయ్య, గణపతి, జీవానందరెడ్డి, సంజీవి, భాస్కర్‌పిళ్ళై, డీబి.సుబ్రమణ్యం, మనోహర్ తదితరుల చొరవతో వాట్సప్ వేదికగా గత కొద్ది రోజుల నుండి మిత్రులందరూ ఒకరికొకరు పరిచయం చేసుకుని కార్యక్రమానికి ఆహ్వానించి దిగ్విజయంగా నిర్వహించారు. చదువు అనంతరం ఉద్యోగం, వ్యాపారం, పెళ్ళి రిత్యా వివిధ ప్రాంతాల్లో స్థిరపడిన విద్యార్థులందరూ ముందు రోజుకే తమ గ్రామాలకు చేరుకుని కార్యక్రమానికి హాజరై ఒకరినొకరు కలుసుకుని ఆనాటి మధుర జ్ఞాపకాలను తలచుకుంటూ సందడి చేశారు. అలాగే మృతి చెందిన గురువులు, సహ విద్యార్థులకు నివాళులర్పిస్తూ మౌనం పాటించారు. అనంతరం విందు భోజనాలను ఆరగించారు. ఈసందర్భంగా తాము చదువుకున్న పాఠశాలలో మౌలిక సదుపాయాల కల్పనకు చర్యలు చేట్టాలని నిర్ణయించారు. ఈకార్యక్రమంలో సుమారు 100 మందికి పైగా పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.



## బాబు జగ్జీవన్ రామ్ విగ్రహం ఏర్పాటుకు అనుమతి ఇవ్వండి

- కౌన్సిలర్ శంకరయ్య

వెంకటగిరి, జులై 16, ప్రభాతవార్త:



మాజీ ఉప ప్రధానమంత్రి బాబు జగ్జీవన్‌రామ్ విగ్రహం ఏర్పాటుకు అనుమతి ఇవ్వాలని మున్సిపల్ చైర్‌పర్సన్ నక్క భానుప్రియకు 14వ వార్డు కౌన్సిలర్ ఆరి శంకరయ్య వినతిపత్రం అందజేశారు. మీ సేవ కేంద్రం సినిమా హాలు పక్కన ఉన్న ప్రభుత్వ స్థలంలో విగ్రహం ఏర్పాటు చేసేందుకు అనుమతి ఇవ్వాలని కోరారు. బాబు జగ్జీవన్‌రామ్ బడుగు వర్గాల ఆశాజ్యోతి అని అందరికీ గుర్తింపుగా ఉండేందుకు ఆయన విగ్రహం ఏర్పాటు చేస్తామని తెలిపారు. వెంకటగిరిలో ప్రజలందరూ జగ్జీవన్‌రామ్ విగ్రహం ఏర్పాటు చేయాలని కోరుకుంటున్నానని తెలిపారు. మున్సిపల్ కౌన్సిల్‌లో ఆమోదం తెలిపేందుకు అందరూ సహకరించాలని కోరారు.

## రాష్ట్ర భవిష్యత్‌కు భరోసా చంద్రబాబు నాయుడు

వరదయ్యపాళెం, జూలై 16 ప్రభాతవార్త:
ఆంధ్రరాష్ట్ర ప్రజల భవిష్యత్‌కు భరోషా..తెలుగుదేశం పార్టీ అధినేత నారా చంద్రబాబు నాయుడు అని సత్యవేడు నియోజకవర్గ తెదేపా ఇన్‌ఛార్జ్ హెలెన్ అన్నారు. ఆదివారం తెలుగుదేశం పార్టీ ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న భవిష్యత్ గ్యారంటీ బస్సుయాత్ర వరదయ్యపాళెంలో కొనసాగింది. ఈసందర్భంగా డాక్టర్ హెలెన్ మాట్లాడుతూ సత్యవేడు నియోజకవర్గ అభివృద్ధికి తాను భరోషాగా నిలుస్తానని పేర్కొన్నారు. రాష్ట్ర భవిష్యత్ అభివృద్ధి పథంలో నడవాలంటే రానున్న ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీకి ప్రజలు మద్ధత్తుగా నిలవాలన్నారు. అధేవిధంగా మాజీ ఎంపి పనబాక లక్ష్మి మాట్లాడుతూ జగన్‌రెడ్డి పదవికి కాలం చెల్లిందన్నారు. వైకాపా పాలనలో జరుగుతున్న దురాగతాలకు తగిన విధంగా ప్రజలు బుద్ది చెపుతారని, ప్రజలు తెలుగుదేశం పార్టీ విజయాన్ని కోరుకుంటున్నారని అన్నారు. రానున్న కాలంలో తెలుగుదేశం పార్టీ ఘన విజయం తధ్యమని ధీమా వ్యక్తం చేశారు. నాయకులు సురేంద్రకుమార్, నరసింహయాదవ్, ఎస్సీవి నాయుడు, పరసారత్నం, సురేంద్రకుమార్, యుగంధర్‌రెడ్డి, నిర్మల్ తదితరులు పాల్గొన్నారు.

## కె.సి. మల్టీ స్పెషాలిటీ ఆస్పత్రిలో ఉచిత దంత వైద్యశిబిరం

- చైర్మన్ డా॥ మంజునాథ్

కుప్పం, జూలై 16 ప్రభాతవార్త



కుప్పం పట్టణం కమతమూరు రోడ్‌లోని కెసి మల్టీ స్పెషాలిటీ ఆస్పత్రిలో ఆగస్టు 15వతేది వరకు ఉచిత దంత వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు ఆస్పత్రి చైర్మన్ డా॥ మంజునాథ్ తెలిపారు. ఉచితకన్సల్టేషన్, దంతాలపైఉన్నమరకలు, పిప్పి దంతాలు ఉచితంగా తొలగించడం జరుగుతుందన్నారు. ప్రముఖ రూట్ కెనాల్ స్పెషలిస్ట్ అయిన డా॥ భవ్య అధ్వర్యంలో ఉచిత దంత వైద్య సేవలుఅందిస్తున్నట్లు తెలిపారు. అలాగేతమఆస్పత్రిలో స్పెషాలిటీ, సూపర్ స్పెషాలిటీవిభాగాల సేవలుఅందిస్తున్నట్లుతెలిపారు. వివరాలకు 8090905900నెంబరును సంప్రదించాలని కోరారు.

## తెలుగుయువతచే గుర్తు చేసుకుందాం.. రుణం తీర్చుకుందాం

కుప్పం, జూలై 16 ప్రభాతవార్త



కుప్పం మండలంలో తెలుగు యువత విభాగంఅధ్వర్యం లో గుర్తు చేసుకుందాం, రుణం తీర్చు కుందాం కార్యక్రమంను అన్ని పంచాయతీల్లో చేపడుతున్నట్లు మండల యువత అధ్యక్షుడు సుబ్బు పేర్కొన్నారు. ఆదివారం నియోజకవర్గ తెలుగుయువత అధ్యక్షుడు వెంకటేష్ అధ్వర్యంలో స్థానిక పార్టీ కార్యాలయంలో యువత సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని 29 పంచాయతీల పరిధిలో ఈకార్యక్రమం చేపట్టాలని పేర్కొన్నారు. పార్టీ అధినేత చంద్రబాబునాయుడు ప్రకటించిన సూపర్ సిక్స్ మేనిఫెస్టోను, యువతకు ప్రకటించిన పథకాలను ప్రజల్లో తీసుకెళ్లాలని కోరారు. కుప్పం మండలంలో అధినేతకు అత్యధిక మెజార్టీ సాధించేందుకు అందరూ కలసికట్టుగా పనిచేయాలని కోరారు. సమావేశంలో మండల పార్టీ అధ్యక్షుడు ప్రేమ్‌కుమార్, సమన్వయ కమిటీ సభ్యుడు చెక్కునత్తం మణి, ప్రధాన కార్యదర్శి సురేష్, రాష్ట్ర, జిల్లా నేతలు పార్థసారథి, అశోక్, మండల నేతలు గోపి, ధర్మలింగం తదితరులు పాల్గొన్నారు.

## త్రైత సిద్ధాంత భగవద్గీతపై ప్రచారం

కుప్పంరూరల్, జూలై 16 ప్రభాతవార్త



మండలంలోని చందం గ్రామంలో త్రైత సిద్ధాంత భగవదీ గ తపై ఆదివారం ప్రచారం నిర్వహించారు. శ్రీఆచార్య ప్రబోధా నంద యోగీశ్వరుల భావాలను వివరించారు. కార్యక్ర మంలో కమిటీ అధ్యక్షుడు కృష్ణ, నాగరాజు, ప్రకాష్, కృష్ణారెడ్డి, సుధాకర్, శరవణ, వెంకటేష్, చరణ్, ఇందిర, రాధ, తిమ్మక్క, వెంకటలక్ష్మి, యశ్విని పాల్గొన్నారు.

## కారుతో సహా కర్ణాటక మద్యం స్వాధీనం.. ఒకరి అరెస్ట్

కుప్పం, జూలై 16 ప్రభాతవార్త



రామకుప్పం మండలం విజలాపురం క్రాస్‌లో వాహనాలు తనిఖీ చేస్తుండగా మారుతి ఓమ్ని కారులో కర్ణాటక మద్యంను అక్రమంగా తరలిస్తూ ఓ వ్యక్తి పట్టుబడినట్లు సెబ్ సిఐ కిషోర్‌కుమార్ తెలిపారు. భూమండ్లపురంకు చెందిన బాలచంద్ర (26) అనే వ్యక్తి మారుతి ఓమ్ని (కెఎ07ఎం3060)వాహనంలో 384కర్ణాటక మద్యం ప్యాకెట్లు తరలిస్తూ పట్టుబడ్డాడన్నారు. వాహనంతో సహా మద్యాన్ని స్వాధీనం చేసుకుని నిందితుడ్ని రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎస్సై రామూర్తి, సిబ్బంది పాల్గొన్నారు.

# చిత్తూరు డివిజన్

చిత్తూరు, గంగాధరనెల్లూరు, పూతలపట్టు, పలమనేరు, కుప్పం

## అశ్వవాహనసేవను వైభవంగా నిర్వహించాలి

కాణిపాకం, జూలై 16 ప్రభాతవార్త:



కాణిపాకం శ్రీవరసిద్ది వినాయకస్వామివారి బ్రహ్మోత్స వాల సందర్భంగా జరిగే అశ్వవాహన సేవను అత్యంత ఘనంగా నిర్వహించాలని ఉత్సవ ఉభయ దారులు నిర్ణయించారు. దేవస్థానంలో బ్రహ్మోత్స వాల సందర్భంగా అశ్వవాహనసేవ కార్యక్రమం నిర్వహణపై ఉభయదారులైన బొమ్మసముద్రం, తిరువణంపల్లె, చింతమాకులపల్లె, కారకాంపల్లె, గ్రామాదుల గోనుగుంట బలిజ వంశస్థులు కాణిపాకం మణికంఠేశ్వరాలయంలో సమావేశమయ్యారు. ఈసందర్భంగా స్వామివారికి జరిగే అశ్వవాహనసేవను అంగరంగ వైభవంగా నిర్వహించాలని నిర్ణయించారు. ఈసందర్భంగా చేపట్టవలసిన ఏర్పాట్లుపై వారు చర్చించారు. ఈసమావేశంలో ఉత్సవ ఉభయదారులు పాల్గొన్నారు.

## ఘనంగా గురివిదేవర..మాజీమంత్రి అమర్ చే ప్రత్యేకపూజలు.

పెద్దపంజాణి జూలై16 ప్రభాతవార్త :



పెద్దపంజాణి మండలం వీరపల్లి పంచాయతీ మారప్పల్లిలో గురివిదేవరను ఆదివారం గ్రామస్థులు ఘనంగా నిర్వహిం చారు. ఈ సందర్భంగా పరమేశ్వరునికి గ్రామస్థులు ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. మహిళలు పెద్దఎత్తున గురివిదేవరలో ప్రతిష్టించిన పరమేశ్వరునికి పొంగళ్ళు సమర్పించారు. కాగా గురివిదేవర జాతరకు మాజీమంత్రి నూతనకాల్వ అమర్నాథ్ రెడ్డి హాజరుకాగా గ్రామస్తులు ఆయనకు ఘనస్వాగతం పలికారు. ఈ సందర్భంగా మాజీమంత్రి అమర్నాథ్‌రెడ్డి ప్రత్యేకంగా ప్రతిష్టించిన పరమేశ్వరున్ని దర్శించుకుని ప్రత్యేకపూజలు నిర్వహించారు. పలువురు తెలుగుదేశం నాయకులు, గ్రామస్థులు అధికసంఖ్యలో పాల్గొన్నారు.

## మంత్రి పెద్దిరెడ్డి పర్యటన జయప్రదం చేయాలి

- ఎమ్మెల్సీ, జిల్లా వైకాపా అధ్యక్షుడు భరత్

కుప్పం, జూలై 16 ప్రభాతవార్త



రాష్ట్ర అటవీ, గనులు, విద్యుత్ శాఖ మంత్రి డా॥ పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి కుప్పం పర్యటన విజయవంతం చేయాలని ఎమ్మెల్సీ, జిల్లా వైకాపా అధ్యక్షుడు భరత్ కోరారు. 17న కుప్పం మున్సిపల్ పరిధి 9,10,11, 12,13,14,15,7,8, 16,17,20,18,19,21,22,23,24 వార్డుల పరిధిలో వార్డుబాట కార్యక్రమం చేపడ్తారన్నారు. 18న 1-6వార్డులతో పాటు 25వవార్డుల్లో వార్డుబాట, కుప్పం బస్టాండులో బహిరంగసభలో మంత్రి పాల్గొంటారన్నారు. వైకాపా నేతలు, కార్యకర్తలు, అభిమానులు మంత్రి పర్యటనను విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమాల్లో రిటైర్డ్ ఐజి ఎంకె సింగ్, యువనేత అజయ్, మాజీ పిఎసిఎస్ ఛైర్మన్ పత్రాల మునిరత్నం పాల్గొన్నారు.

## వినాయక హైస్కూల్‌కు జాతీయ స్థాయి ఐకాన్ అవార్డు

కుప్పంరూరల్, జూలై 16 ప్రభాతవార్త



కుప్పం మున్సిపల్ పరిధి తంబిగానిపల్లిలోని వినాయక హైస్కూల్‌కు కేంద్ర ప్రభుత్వ అనుబంధ సంస్థవారు జాతీయ స్థాయిలో ఉత్తమ పాఠశాలగా ఐకాన్ అవార్డును అందించారు. ఆదివారం న్యూఢిల్లీలోని వివాంత తాజ్ ఫంక్షన్ హాల్‌లో జరిగిన కార్యక్రమంలో పుదుచ్చేరి లెఫ్టినెంట్ గవర్నర్ కిరణ్‌బేడి చేతుల మీదుగా పాఠశాల ఛైర్మన్ డా॥ ఎం. కృష్ణ అవార్డు అందుకున్నారు. ఈసందర్భంగా డా॥ కృష్ణ మాట్లాడుతూ తమ పాఠశాలకు జాతీయ స్థాయిలో అవార్డు రావడం పట్ల ఆయన హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఢిల్లీ దక్షిణ జిల్లా కలెక్టర్ మీకల చైతన్య ప్రసాద్ పాల్గొన్నారు.

# గూడూరు డివిజన్

గూడూరు, సూళ్లూరుపేట, వెంకటగిరి నియోజకవర్గాలు

## ఘనంగా మస్తానయ్య గంధోత్సవం

దొరవారిసత్రం, జూలై 16 ప్రభాతవార్త
దొరవారిసత్రం మండలం అక్కరపాక గ్రామంలో శ్రీమస్తానయ్య గంధోత్సవం ఘనంగా నిర్వహించారు. మూడురోజుల పాటు అక్కరపాక గ్రామంలో ఘనంగా పండుగ వాతావరణంతో గంధోత్సవాన్ని నిర్వహించారు. గ్రామంలోని యువత, మహిళలు, పెద్దలు అందరూ కలిసికట్టుగా గ్రామమంతా జెండాలు ఏర్పాటు చేసి గ్రామానికి చుట్టూ జెండాలతో ఊరేగించారు. ఈ ఊరేగింపునకు భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి మస్తానయ్య దర్గా వద్ద ప్రార్ధనలు చేశారు. అనంతరం సుమారు 400 మందికి అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ గంధోత్సవంలో కమిటీ సభ్యులు తల్లం రమేష్, కటారి వెంకటరమణయ్య, సుధాకర్, కల్యాణ్ తదితరులు ఉన్నారు.

## ఘనంగా ఆకుతోట జన్మదిన వేడుకలు

సూళ్లూరుపేట, జూలై 16 ప్రభాతవార్త



సూళ్లూరుపేట తెలుగుదేశం పార్టీ పట్టణ అధ్యక్షుడు ఆకుతోట రమేష్ జన్మదిన వేడుకలను అభిమానులు, పార్టీ నేతలు, కార్యకర్తల ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా భారీ కేక్‌లు కట్ చేసి, గజమాలలతో ఆయనను సత్కరించారు. పెద్దఎత్తున బాణాసంచా కాల్చారు. టిడిపి కార్యకర్తగా పార్టీ ఆవిర్భావం నుంచి పనిచేస్తూ క్రమశిక్షణ కలిగిన నేత అని మాజీ ఎంపీ, నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జ్ నెలవల సుబ్రహ్మణ్యం తెలిపారు. ఈ కార్యక్రమంలో తిరుపతి పార్లమెంటరీ పార్టీ అధికార ప్రతినిధి తిరుమూరు సుధాకర్‌రెడ్డి, పెంచలకోన ట్రస్టుబోర్డు మాజీ ఛైర్మన్ తానంకి నానాజి, సుబ్రహ్మణ్యంనాయుడు, పలువురు అభిమానులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## రేషన్ బండి.. ఇంటికి రాదండి

కోట, జూలై 16 ప్రభాతవార్త



రేషన్ బండ్లు (ఎండియు వాహనాలు) ఇంటింటికి తిరుగుతున్నాయి. జిపిఆర్ఎస్ పెట్టాం. పర్యవేక్షణ చేస్తున్నామని పౌరసరఫరాల అధికారులు చెప్తున్నా క్షేత్రస్థాయిలో ఆ పరిస్థితి కనిపించడం లేదు. మండలంలో పలువురు ఎండియు ఆపరేటర్లు వీధుల్లో రేషన్ బండి ఎక్కడ పడితే అక్కడ ఆపేస్తున్నారు. కార్డుదారులు అక్కడికి వెళ్లి సరుకులు తీసుకుంటున్నారు. ఎండియు ఆపరేటర్లు ఎక్కువమంది వైసీపీ అనుచరులు కావడంతో అధికారులు పట్టించుకోవడం లేదని వినియోగదారులు ఆరోపిస్తున్నారు. ఇంటింటికి రేషన్ బండి తిరుగుతుందని ప్రభుత్వం ప్రతి నెలా రూ.21 వేలు చెల్లిస్తోంది. వలంటీర్లు చెప్పరు.. సమాచారం ఇవ్వరుఎండియు వాహనాల ద్వారా ఇంటింటికి రేషన్ పంపిణీ కార్యక్రమాన్ని ప్రభుత్వం రెండున్నరేళ్ల క్రితం చేపట్టింది. చౌక దుకాణాలకు వెళ్లాల్సిన అవసరం లేకుండా మీ ఇంటి వద్దకే రేషన్ బండి వస్తుందని, ఎప్పుడు ఏ రోజు బండి మీ వీధికి వస్తుందో ముందుగానే సంక్షిప్త సమాచారం అందిస్తామని, వలంటీర్ల ద్వారా తెలియజేస్తామని ముఖ్యమంత్రి అప్పట్లో పదేపదే చెప్పారు. 1వ తేదీ రావాల్సిన రేషన్ బండి ఐదారు.. లేదంటే 7, 8 తేదీల్లో వీధిలోకి వస్తుంది. వాహనం వస్తుందన్న సమాచారం ఎవరూ తెలపడం లేదు. గతంలో చౌక దుకాణాల వద్ద కార్డుదారులు నిరీక్షించి సరుకులు తీసుకెళ్లే వారు. ప్రస్తుతం వీధిలో ఓ మూల ఎండియు వాహనం నిలిపి కార్డుదారులకు సరుకులు అందిస్తున్నారు.

## అంగన్‌వాడీ వంట .. అప్పుల మంట

కోట, జులై 16 ప్రభాతవార్త
అంగన్‌వాడీ కేంద్రాలల్లో వంటలు కార్యకర్తలు, ఆయాలకు అప్పుల మంటగా మారిపోతున్నాయి. నిత్యావసరాల ధరలు భారీగా పెరిగినా.. ప్రభుత్వం అరకొరగా లెక్కలు కట్టి బిల్లులు వేస్తోంది. దీంతో అప్పులు పాలవుతున్నామని కార్యకర్తలు ,ఆయాలు చెబుతున్నారు. బాలింతలు, గర్భిణులు, పిల్లలకు మెరుగైన ఆహారం అందించాలని, యోచించిన ప్రభుత్వం మెనూలో మార్పులు చేసింది. అయితే మార్కెట్ ధరలకు అనుగుణంగా బిలులు పెంచడంలేదు. దీంతో వారికి నెలాఖరు వచ్చేనాటికి చేసిన ఖర్చుకు వచ్చిన బిల్లులు పొంతన లేకుండా పోతోంది. కోత్తపట్నం, సిద్దవరం, కర్లపూడి, ఉత్తమనెల్లూరు. అల్లంపాడు, తిన్నెలపూడి, చెందోడు, గూడలి, చిట్టేడు, కేశవరం, కొండుగుంట, మద్దాలి, చంద్రశేఖపురం, వెంకనపాళెం, తదితర గ్రామాల్లో వారి పరపతి ఉపయోగించి అరువు తెచ్చుకున్న సరకులకు ప్రతి నెలా బిల్లులు చెల్లిండంలేదు. ఇంకా మారు మూల కేంద్రాలకు పాలు, గుడ్ల సరఫరా నామామాత్రవంగానే జరుగుతోంది. అధికారులు కాయగూరలు, పప్పుదినుసులు, గ్యాస్ బిల్లులు ఒకే సారి ఇవ్వకపోవడంతో కార్యకర్తలకు ఇబ్బందులు తప్పడంలేదు.

# రాష్ట్రంలో సుస్థిర పాలన సీఎం జగన్‌తోనే సాధ్యం

## - సూళ్లూరుపేట ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య

నాయుడుపేట, జూలై 16 ప్రభాతవార్త
రాష్ట్రంలో సుస్థిర పాలన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే సాధ్యమని సూళ్లూరుపేట ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య అన్నారు. ఆదివారం నాయుడుపేట మండలం బిరదవాడలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఇంటింటికి వెళ్లి ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలను వివరిస్తూ, ప్రజా సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రజలకు ప్రభుత్వ పథకాల బుక్‌లెట్లు అందజేశారు. ఆయన మాట్లాడుతూ ప్రతి పేదవాడికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందజేస్తూ పేదల ఇంట వెలుగులు నింపుతున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మరో 30 ఏళ్ల ముఖ్యమంత్రిగా ఉండాలని ప్రజలంతా కోరుకుంటున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్‌పర్సన్ కటకం దీపిక, ఎఎంసి ఛైర్మన్ తంబిరెడ్డి జనార్ధన్‌రెడ్డి, మండల వైసీపీ అధ్యక్షులు తంబిరెడ్డి జనార్ధన్‌రెడ్డి, మున్సిపల్ వైస్ ఛైర్మన్ జలదంకి వెంకటకృష్ణారెడ్డి, ఎంపిపి కురుగొండ ధనలక్ష్మి, వైసీపీ నాయకులు కలికి మాధవరెడ్డి, కటకం జయరామయ్య, నాగిరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి, బైనా మల్లికార్జునరెడ్డి, పేట చంద్రారెడ్డి, గందవల్లి సిద్దయ్య, పలువురు కౌన్సిలర్లు, వైసీపీ నాయకులు పాల్గొన్నారు.



## శ్రీ సీతారామధార్మిక సేవా సంస్థ ఆధ్వర్యంలో రుద్రాక్ష మాలలు పంపిణీ

వాకాడు, జులై 16, ప్రభాతవార్త



వాకాడు మండలం బాలిరెడిపాళెం ఆముదాలపాడు హరిజనవాడలోని శ్రీ వీరబ్రహ్మేంద్ర స్వామి దేవస్థానంలో 50 మంది గురుబిడ్డలకు శ్రీ సీతారామ ధార్మిక సేవా సంస్థ ఆధ్వర్యంలో ఆదివారం ప్రవాస భారతీయులు రామిరెడ్డి వెంకటరామిరెడ్డి, హైమావతమ్మ దంపతుల సౌజన్యంతో ఎనిమిది వేల రూపాయిల విలువచేసే రుద్రాక్ష మాలలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సంస్థ ప్రతినిధి దీవి అనంతబాబు మాట్లాడుతూ పరమేశ్వరుడికి ప్రతిరూపంగా చెప్పబడే రుద్రాక్షమాలను దారణ చేయడం వలన పవిత్రత చేకూరుతుందని, తద్వారా దైవిక కార్యక్రమాలలో ద్విగుణీకృతమైన ఫలితాలు లభిస్తాయని అందుకోసం శ్రీ సీతారామ ధార్మిక సేవా సంస్థ చేస్తున్న ధార్మిక కార్యక్రమాల్లో భాగంగా ఈ దేవాలయంలో 50 మంది వీరబ్రహ్మేంద్ర స్వామి భక్తులైన గురు బిడ్డలకు రుద్రాక్ష మాలలను అందజేయడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న శ్రీ రామసేన అధ్యక్షుడు కొడవలూరు హరీష్ రెడ్డి మాట్లాడుతూ ప్రవాస భారతీయుడుమధు కిరణ్ రెడ్డి సౌజన్యంతో ఏర్పాటు చేసిన శ్రీ సీతారామధార్మిక సేవా సంస్థ ఎన్నో ధార్మిక కార్యక్రమాలు చేస్తుందని ఈ కార్యక్రమాల్లో శ్రీ రామసేన యువకులను కూడా భాగస్వామ్యం చేయడం అభినందనీయమన్నారు. ఈ సందర్భంగా దాతలకు హృదయపూర్వక అభినందనలు తెలియజేసారు. ఈ కార్యక్రమంలో ఎంబేటి మస్తానయ్య, మణెయ్య, ఎంబటి శ్రీనివాసులు, శ్రీ రామసేన యువకులు కిరణ్ కుమార్, వంశీ, తూపిలి గురు ప్రసాద్, గురు బిడ్డలు మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. విచ్చేసిన భక్తులకు తీర్ధ ప్రసాద వినియోగం చేశారు.

## అనారోగ్యంతో ఆర్మీ జవాన్ మృతి



పూతలపట్టు, జూలై 16 ప్రభాతవార్త: మండలంలోని అయ్యప్పగారిపల్లె గ్రామ పంచాయతీ తోటవారి పల్లెకు చెందిన ఆర్మీజవాన్ హేమంత్‌కుమార్ విధి నిర్వహణలో వుండగా ఆదివారం అనారోగ్యంతో మృతి చెందినట్లు ఆర్మీ అధికారుల నుండి గ్రామస్థులకు ఆదివారం సమాచారం అందినట్లు గ్రామస్థులు తెలిపారు. చండీఘర్‌లో హవల్దార్‌గా పనిచేస్తున్న హేమంత్‌కుమార్ సెలవుపై గ్రామానికి వచ్చారు. సెలవులు పూర్తికావడంతో గత పది రోజుల క్రితమే చండీఘర్ వెళ్ళి విధుల్లో చేరారు. ఇతను అనారోగ్యానికి గురై ఆదివారం మృతి చెందినట్లు ఆర్మీ అధికారులు హేమంత్‌కుమార్ కుటుంబసభ్యులకు సమాచారం అందించారు. దీనితో హేమంత్‌కుమార్ భార్య, కుటుంసభ్యులు హుటాహుటిన చండీఘర్ బయలుదేరి వెళ్ళారు. ఈయనకు భార్య, కుమారుడు, కుమార్తె వున్నారు. పది రోజుల క్రితం వరకు గ్రామంలో కలివిడిగా తిరిగిన హేమంత్ కుమార్ ఆకస్మిక మృతి చెందడంతో గ్రామంలో విషాదచాయలు అలుముకున్నారు.

## ఉచిత కంటి ఆపరేషన్లకు 58మంది ఎంపిక

కుప్పంరూరల్, జూలై 16 ప్రభాతవార్త



సాయిమాతా సేవా ట్రస్ట్, తిరుపతి ఎస్వి అరవింద్ కంటి ఆస్పత్రిచే కుప్పంలో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరంకు విశేష స్పందన లభించింది. మొత్తం 250మంది శిబిరంకు హాజరు కాగా వారికి కంటి పరీక్షలు నిర్వహించి 58మందిని ఉచిత కంటి ఆపరేషన్లకు ఎంపిక చేశారు. రోగులకు ఎమ్మెల్సీ భరత్ భోజన వసతి సమకూర్చారు. కార్యక్రమంలో వైద్యులు భవ్య, మధురిమ, తేజకృష్ణ, గౌరిశంకర్, ట్రస్ట్ వ్యవస్థాపకులు జగదీష్‌బాబు పాల్గొన్నారు.

# మీ వెంటే మేమంతా

## వైసిపికి అండగా మైనారిటీలు
## జగనన్నను మళ్లీ సీఎం చేసుకోవడమే లక్ష్యం
## వైసిపి మైనారిటీ కార్యాలయ ప్రారంభోత్సవంలో మగ్ధూమ్ వెల్లడి

గూడూరు, జులై 16, ప్రభాతవార్త
రాష్ట్రంలోని మైనారిటీలందరూ వైసిపి వెంటే ఉన్నారని, 2024లో మళ్లీ జగనన్నను సిఎం చేసుకోవడమే లక్ష్యమని వైసిపి మైనారిటీ సెల్ రాష్ట్ర కార్యదర్శి ఎండి మగ్ధూమ్ మోహిద్దీన్ అన్నారు. ఆదివారం దుర్గావీధిలో వైసిపి మైనారిటీ విభాగం నూతన కార్యాలయాన్ని మైనారిటీ నాయకులతో కలిసి ముఖ్య అతిధిగా హాజరైన వైసిపి రాష్ట్ర యువజన విభాగం ప్రధాన కార్యదర్శి కొండూరు సునీల్ రెడ్డి చేతులు మీదుగా ప్రారంభించారు. ఈ సందర్భంగా మగ్ధూమ్ మాట్లాడుతూ గతంలో కూడా 2014 నుండి 2019 వరకు మైనారిటీ కార్యాలయాన్ని నిర్వహించామన్నారు. ప్రస్తుతం మైనారిటీల సమస్యలను స్వయంగా తెలుసుకునేందుకు వీలుగా పెద్ద మసీదు వీధి, దర్గా వీధి, సాదుపేట, బనిగి సాహెబ్ పేటలకు దగ్గరగా దర్గావీధిలో మైనారిటీ కార్యాలయాన్ని ప్రారంభించినట్లు తెలిపారు. ఇక పై మైనారిటీ పత్రికా సమావేశాలన్నీ ఇక్కడ నుండే నిర్వహిస్తామన్నారు. అలాగే ఇటీవల కాలంలో ప్రతిపక్ష పార్టీలు



నోటికొచ్చినట్లుగా మాట్లాడుతున్నారని ఇది మంచి పద్ధతి కాదని అన్నారు. ఎవరి పాలనలో ప్రజలకు మేలు జరుగుతందో ప్రజలకు తెలుసన్నారు. ప్రజలందరూ జగన్ మోహన్ రెడ్డికే తిరిగి పట్టం కడతారని తెలిపారు. కొండూరు సునీల్ రెడ్డి మాట్లాడుతూ వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ముస్లీం మైనారిటీల పార్టీ అని అన్ని వర్గాల ప్రజలకు సంక్షేమం, అభివృద్ధి రెండు కళ్ళుగా పరిపాలన అందిస్తూ ప్రజల ఆశీర్వాదాలు పొందుతున్నారని ప్రజలందరూ వైసిపి వెంట ఉన్నారని తెలిపారు. ప్రతిపక్షాలు అను నిత్యం అసత్య ప్రచారాలు చేస్తూ లేని పోని నిరాధారమైన నిందలు వేస్తూ ప్రజలను వైసిపి నుండి దూరం చేయాలనే కుటిల యత్నం చేస్తున్నారని ఆరోపించారు. 2024 ఎన్నికల్లో ప్రజలు సరైన రీతిలో బుద్ధి చెబుతారన్నారు. వైసిపికి 85 శాతం ముస్లిం ఓటు బ్యాంక్ ఉందని స్పష్టం చేశారు. గూడూరు పట్టణ మైనారిటీల సమస్యల పరిష్కారానికి ఈ కార్యాలయం ఒక వేదికగా మారుతుందని హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో వైసిపి రాష్ట్ర మైనారిటీ సెల్ కార్యదర్శి మగ్ధూమ్, కొండూరు సునీల్ రెడ్డి, బాబు, జమీర్, షబ్బీర్, కొట్టు అశోక్, సందాని భాషా, యస్దాన్, అర్షద్, షాకిర్, బిఎస్ఎన్ఎల్ యస్దాని, నయీమ్, కరిముల్లా తదితరులు పాల్గొన్నారు.

# పలుకుబడి ఉంటే అభిషేకానికి అనుమతి!



శ్రీకాళహస్తి, జూలై 16 ప్రభాతవార్త : శ్రీకాళహస్తీశ్వరాలయంలో ఎవరు విఐపిలో ఎవరు కాదో అంతుపట్టని స్థితి చోటు చేసుకుంది. రాహుకేతుదోష నివారణ ప్రత్యేక పూజల వద్ద పీటలు రిజర్వేషన్. ఇక అంతరాలయ దర్శనాల వివాదాలు చోటు చేసుకుంటున్నాయి. నియమ నిబంధనలను ఖచ్చితంగా పాటిస్తే వివాదాలు, విమర్శలు ఆరోపణలు ఉండవు. కానీ ఒకరు వస్తారు పార్టీ అఫీస్ అంటారు, ఒకరు వస్తారు ప్రోటోకాల్ విఐపి అంటారు. ఇంకొకరు వస్తారు పర్సనల్ అంటారు. ఇలా ఎవరికి వారు తమ పలుకుబడిని ఉపయోగిస్తున్నారు. అయితే అభిషేకాలు, అంతరాలయ దర్శనాలకు సంబంధించి అభిషేక గురుకుల్స్‌కు కూడా తలనొప్పిగా మారుతుంది. ఆదివారం సాయంత్రం అమ్మవారి ఆలయం వద్ద అమ్మవారి అభిషేకానికి సంబంధించి పూజారి నియమనిష్టలతో వచ్చారు. అయితే అభిషేకానికి ఒకరిని అనుమతించమని రావటంతో కుదరదని పూజారి అమ్మవారి అభిషేకానికి వెళ్ళకుండా బయటే నిలిచిపోయారు. దాంతో సమాచారం అందుకున్న టెంపుల్ ఇన్స్పెక్టర్ ఆఘమేఘాల మీద పరుగున వచ్చారు. ఆ ఒక్కరినే కూర్చొబెట్టి అభిషేకం చేయటం పట్ల భక్తుల్లో తీవ్ర అసంతృప్తి చోటు చేసుకుంది. సాధారణంగా అభిషేకానికి ఎవ్వరిని అనుమతించటం లేదు, ప్రోటోకాల్ విఐపిలుంటే వారిని కూర్చొబెడతారు. అయితే శ్రీకాళహస్తీశ్వరాలయంలో పలుకుబడి కల్గిన వారందరూ ప్రోటోకాల్ విఐపిలుగా మారి వ్యవస్థను అభాసుపాల్జేస్తున్నారు. ఆలయ పవిత్రను కాపాడటానికి ఇక్కడ విధి విధానాలు, సంప్రదాయాలు, ఆచారాలకు ప్రాధాన్యత ఇవ్వాల్సిన అవసం ఎంతైనా ఉంది.

**అభిషేకాలు, పూజలకు కిట కిట:**

శ్రీకాళహస్తీశ్వరాలయంలో ఆదివారం భకక్తులతో కిట కిట లాడింది. అభిషేకాలు, రాహుకేతుదోష నివారణ పూజలకు విశేష స్పందన వచ్చింది. రాహుకేతుదోష నివారణ పూజలు 5వేలు దాటాయి. అలాగే స్వామి అమ్మవార్ల అభిషేకాలు 128జరిగాయి. అలాగే మహాన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకాలు 58 జరిగినట్లు దేవస్థానం ప్రకటించింది. అయితే రద్దీ లేని రోజుల్లో అభిషేకాలకు అంతరాలయంలో కూర్చొబెడుతున్నామని రద్దీ రోజుల్లో అనుమతించటం లేదని దేవస్థానం అధికారులు వివరణ ఇస్తున్నారు.

# సీఎం సభను విజయవంతం చేయండి

## - వైసీపీ జిల్లా అధ్యక్షులు నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి



వెంకటగిరి, జులై 16 ప్రభాతవార్త: ఈ నెల 21వ తేది సీఎం జగన్మోహన్‌రెడ్డి వెంకటగిరికి వస్తున్న సందర్భంగా ఆయన సభకు భారీగా జన సమీకరణ చేసి విజయవంతం చేయాలని వైసీపీ జిల్లా అధ్యక్షులు నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. వెంకటగిరిలోని ఎన్‌జెఆర్ భవనంలో వెంకటగిరి, డక్కిలి, బాలాయపల్లి మండలాల నాయకులతో సీఎం సభ విషయమై సమావేశం నిర్వహించారు. నాలుగు సంవత్సరాల పాటు వెంకటగిరి ఎంతగానో వెనుకబడిందని సీఎం వస్తున్నందువలన ఆయన అభివృద్ధికి తోడ్పాటు అందిస్తారని తెలిపారు. చేనేత కార్మికులకు నేతన్న నేస్తం నగదును సీఎం జగన్మోహన్‌రెడ్డి వెంకటగిరి నుండి బటన్ నొక్కి కార్మికుల ఖాతాలో జమ చేస్తారని తెలిపారు. సీఎం జగన్మోహన్‌రెడ్డి సభను అందరూ కలిసికట్టుగా విజయవంతం చేయాలని సూచించారు. ప్రతి గ్రామాల నుండి జనాన్ని తీసుకురావాలని సూచించారు. సీఎం సభను ప్రతిష్టాత్మకంగా తీసుకోవాలని కోరారు. సమావేశంలో మాజీ ఆర్టీసీ చైర్మన్ చెలికం శంకర్‌రెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్‌పర్సన్ దొంతు శారద, చైర్‌పర్సన్ నక్కా భానుప్రియ, పద్మశాలి కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ నక్కా వెంకటేశ్వరరావు, వైసీపీ జిల్లా సంయుక్త కార్యదర్శి, వైస్ చైర్మన్ బాలయ్య, ఉమామహేశ్వరి, వైసీపీ నాయకులు కోటేశ్వరరావు, ప్రసాద్‌రెడ్డి, నాగయ్య, హరికృష్ణ, కౌన్సిలర్ వహీదా, సుబ్బారావు, సురేష్‌రెడ్డి, పూజారి లక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

## శాస్త్రోక్తంగా చండికా పరమేశ్వరి చక్రేశ్వరస్వామి మహాకుంభాభిషేకం



తొట్టంబేడు, జూలై 16 ప్రభాతవార్త : మండలంలోని నెల్లిమానుకండ్రిగల గ్రామంలో నూతనంగా నిర్మించిన శ్రీచండికా పరమేశ్వరి సమేత శ్రీచక్రేశ్వరస్వామి మరియు ధ్వజస్తంభ ప్రతిష్ట మహాకుంభాభిషేక మహోత్సవాన్ని ఆదివారం శాస్త్రోక్తంగా నిర్వహించారు. శ్రీచండికాంబికా పీఠం ట్రస్టు వ్యవస్థాపకులు సింగరాజు ప్రకాశం శాస్త్రి దంపతుల ఆధ్వర్యంలో మణికంఠస్వామి సారధ్యంలో వేదపండితులు మహాకుంభాభిషేక పూజా కార్యక్రమాలు శాస్త్రోక్తంగా చేపట్టారు. ఈనెల 12వ తేదీ నుంచి కార్యక్రమాలు జరుగుతున్నాయి. శాస్త్రోక్తంగా పూజా కార్యక్రమాలుచేపట్టిన కలశహోమాల నుంచి పవిత్రజలాలకు పూజలు జరిపి ఊరేగింపుగా మేళతాళాలు మంగళవాయిద్యాలు నడుమ కళశాలలో ఉన్న పవిత్రజలాలను ఆలయంపై ఉన్న శిఖరాలపై వేదమంత్రోచ్చారణల మధ్య కలశాభిషేకం జరిపారు. అనంతరం చక్రేశ్వరస్వామికి కలశాభిషేకం శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఆలయ ఆవరణలో ప్రతిష్టించిన రాతి ధ్వజస్తంభానికి ప్రత్యేకపూజలు నిర్వహించారు. గ్రామంలో ఉదయం నుంచి సాయంత్రం వరకు వేదమంత్రాలతో పునీతమైంది. కార్యక్రమాల్లో ఎంఎల్ఏ తనయ బియ్యపుపవిత్రారెడ్డి, శ్రీకాళహస్తీశ్వ రాలయ ఛైర్మన్ అంజూరు తారకశ్రీనివాసులు, చండికాంబికాపీఠం ట్రస్టు వ్యవస్థాపకులు సింగరాజు ప్రకాశంశాస్త్రి దంపతులు, ఆర్డీవో రామారావు, మాజీ మంత్రి దివంగత నేత స్వర్గీయ బొజ్జల గోపాల కృష్ణారెడ్డి సతీమణి బొజ్జలబృందమ్మలు విచ్చేశారు. ఈసందర్భంగా ఆర్డీవో రామారావు మాట్లాడుతూ క్షేత్ర వైభవాన్ని పెంపొందించే విధంగా మరో విశిష్ట ఆలయం నిర్మాణం కావడం భక్తులకు వరప్రసాదం అన్నారు. చండికాంబిక ట్రస్టు వ్యవస్థాపకులు సింగరాజు ప్రకాశం పంతులు మాట్లాడుతూ కాశీలో మాత్రమే ఉన్న శ్రీచక్రేశ్వరస్వామి తమ కులదేవత శ్రీచండిపరమేశ్వరిదేవి ఆలయాన్ని దాతల సహకారంతో నిర్మించి కుంభాభిషేకం చేయడం తమ పూర్వజన్మ సుకృతం అన్నారు.

## దిగువమాఘంలో బండీమీద కుంభం, బకాసుర వధ



తవణంపల్లె, జూలై 16 ప్రభాతవార్త: మండలంలోని దిగువమాఘంలో గ్రామంలో జరుగుతున్న మహా భారత యజ్ఞం కార్యక్రమంలో భాగంగా ఆదివారం బండీమీద కుంభం, బకాసుర వధ కార్యక్రమంలను అత్యంత వైభవోపేతంగా నిర్వహించారు. ప్రతి ఏటా గ్రామంలోని బహుదానది ఒడ్డున వెలసిన ద్రౌపదీ సమేత ధర్మరాజుల ఆలయంలో 21 రోజుల పాటు జరిగే మహాభారత యజ్ఞం ధర్మకర్త ఆర్. ఉమాపతిరెడ్డి ఆధ్వర్యంలో మాజీ మంత్రి గల్లా అరుణకుమారి, గల్లా రామచం ద్రనాయుడుల సహకారంతో ఈనెల 6న ఘనంగా ప్రారంభమైంది. ఈమేరకు ఆదివారం బండీమీద కుంభం, బకాసుర వధను ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా భీముని వేషదా రుదు ప్రత్యేకంగా అలంకరించిన ట్రాక్టర్‌పై దిగువ మాఘం, వీర్లగుడిపల్లె, కొండ్రాజుకాల్వ, నల్లప్పరెడ్డి, జెట్టిపల్లె, మైలవారి పల్లె, జయనగర్, అమరపురి తదితర గ్రామాలలో పర్యటించి భకుల నుండి అన్న ప్రసాదాలను సేకరించారు. అనంతరం రాత్రి నాటక ప్రదర్శనలో భాగంగా బకాసురవధ కార్యక్రమంను నిర్వహించారు. ఈకార్యక్రమం భక్తులను ఎంతో అలరించింది. ఈకార్యక్రమంలో ఆలయ ధర్మకర్త ఉమాపతిరెడ్డి, మాజీ సర్పంచ్ కుమార్‌నాయుడు, గ్రామస్థులు, భక్తులు పాల్గొన్నారు.

## తెలుగుదేశం బస్సుయాత్రకు విశేష ఆదరణ



శ్రీకాళహస్తి, జూలై 16 ప్రభాతవార్త : బస్సు యాత్ర ఆదివారం ఉదయం సత్యవేడు నియోజకవర్గం బుచ్చినాయుడు కండ్రిగ మండలం పల్లమాల వద్ద వెలసిన పచ్చాలమ్మ ఆలయం వద్ద పూజలు జరిపి శ్రీకారం చుట్టారు. పార్టీ ఇన్‌చార్జి హెలన్, మాజీ మంత్రి పనబాకలక్ష్మీ, మాజీ శాసనసభ్యురాలు హేమలత పార్టీ నాయకులతో భారీ ఎత్తున బస్సు యాత్ర ప్రారంభించారు. మేళ తాళాలు మంగళవాయిద్యాలు భారీ స్వాగతాలతో బస్సుయాత్ర ప్రారంభమైంది. బుచ్చినాయుడు కండ్రిగలో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో రాష్ట్ర కార్యదర్శి గుమ్మడి దశరధాచ్చారి మాట్లాడుతూ శ్రీకాళహస్తి మాజీ శాసనసభ్యుడు ఎస్‌సివి నాయుడు పార్టీ రంగప్రవేశంలో కార్యకర్తలు, ద్వితీయ శ్రేణి నాయకుల్లో జోష్ వచ్చిందన్నారు. ఆయన విజయసంకేతమన్నారు. కార్యకర్తలకు అండగా ఉంటూ అందరిని సమన్వయ పరచుకొని సాగే ఆయన హయాంలో బుచ్చినాయుడు కండ్రగ మండలం ఎంతో అభివృద్ధి చెందిందన్నారు. కాగా వరదయ్య పాళెంలో ఏర్పాటు చేసిన సభలో ఎస్‌సివి నాయుడు మాట్లాడుతూ నేడు మనం మన రాష్ట్రం కష్టాల్లో మునిగిపోయామన్నారు. కన్నీళ్లు దిగమింగుతున్నామని వివరించారు. ఈ పరిస్థితిలో మనకు సమర్థవంతులైన నాయకుని అవసరం ఉందన్నారు. నేడు రాష్ట్రాన్ని పరిపాలిస్తున్న సైకో పోవాలంటే మనమందరం తెలుగుదేశం పార్టీని గెలిపించాలని సమర్థవంతులైన నాయకులు నారా చంద్రబాబు నాయుడును ముఖ్యమంత్రిని చేసే అజెండాతోనే ముందుకునడవాలని పిలుపు నిచ్చారు నేడు మిని మ్యానిఫెస్టోలో ప్రగతి బాటను చంద్రబాబునాయుడు ప్రకటించారు. వాటిని ప్రజలకు అర్థమయ్యేటట్లు చెప్పాలని ఎస్‌సివి నాయుడు కార్యకర్తలకు సూచించారు. మన ప్రయత్నం పట్టుదలలే చంద్రబాబు నాయుడుకు శ్రీరామరక్ష అన్నారు. బస్సు యాత్రలో గుమ్మడి దశరదాచ్చారి, తెలుగుదేశంపార్టీ పార్లమెంటు మహిళా అధ్యక్షురాలు చక్రాల. ఉష, సుధాకర్‌నాయుడు, కన్నయ్యనాయుడు, మధు రమణ య్య, వరదయ్యపాళెంలో నాయకులు యుగంధర్, అనిత, జయచంద్ర నాయుడు, శ్రీనివాసులు నాయుడు తదితరులు హాజరయ్యారు. సత్యవేడు నియోజకవర్గంలో బస్సు యాత్ర దేశం కార్యకర్తల్లో 'జోష్' నింపిందని వివరించారు.

## కాణిపాకంలో భక్తుల రద్దీ రద్దీ



కాణిపాకం, జూలై 16 ప్రభాతవార్త: కాణిపాకం శ్రీవరసిది ధ్ది వినాయక స్వామి అలయంలో ఆదివారం కూడా భక్తుల రద్దీతో పోటెత్తింది. సాధారణంగా ఆలయంలో వారంతపు రోజులు శని, ఆదివారాలు, వరుస సెలవు రోజుల్లో భారీ స్థాయిలో రద్దీ వుంటుంది. ఈమేరకు ఆదివారం సెలవురోజు కావడంతో కావడంతో ఆలయ దర్శనార్థం పెద్దఎత్తున తరలివచ్చారు. వివిధ ప్రాంతాల నుండి తరలివచ్చిన భక్తులతో పాటు తిరుమల వెళ్ళే భక్తజనం కూడా కాణిపాకం స్వామివారి దర్శనార్థం రావడంతో ఆలయంలో తీవ్రస్థాయిలో రద్దీ కొనసాగుతోంది. దీనితో ఆలయంలోని క్యూలైన్లుతో పాటు క్యూకాంప్లెక్స్ పూర్తిగా నిండి పోవడంతో ఆలయం వెలుపల బారులు తీరి నిలబడ్డారు. దీనితో భక్తులు గంటల తరబడి స్వామి దర్శనం కోసం వేచి వుండాల్సిన పరిస్ధితి నెలకొంది. 100 రూపాయల శీఘ్రదర్శనం, 150 రూపాయల అతిశీఘ్రదర్శనం టిక్కెట్లు తీసుకున్న భక్తులు సైతం క్యూకాంప్లెక్స్, క్యూలైన్లులో సుమారు మూడు నాలుగు గంటల వరకు వేచి వుండాల్సిన పరిస్థితి నెలకొంది. ఇదిలా వుండగా ఆదివారం విఐపీల తాకిడి కూడా భారీగా పెరిగింది.

## రాష్ట్ర వైద్యుల శాస్త్ర విజ్ఞాన సదస్సులో రాష్ట్ర మెడికల్ కౌన్సిల్ ఛైర్మన్



తిరుపతి టౌన్, జులై 16 ప్రభాతవార్త : అనంతపురంలో జరిగిన రాష్ట్ర వైద్యుల శాస్త్ర విజ్ఞాన సదస్సునకు రాష్ట్ర మెడికల్ కౌన్సిల్ ఛైర్మన్ డాక్టర్ సాంబశివ రెడ్డి ముఖ్య అతిధిగా హాజరైయ్యారు. ఐఎంఎ రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ రవికృష్ణ అధ్యక్షతన జరిగిన సభలో బీహార్ రాష్ట్ర ఐఎంఎ వైద్యుల దినోత్సవం సందర్భంగా ఐఎంఎ జాతీయ ఉపాధ్యక్షులు డాక్టర్ దగ్గుమాటి శ్రీహరిరావుకు ప్రకటించిన డాక్టర్ ఎకేఎస్ సిన్హా ప్రతిష్టాత్మకంగా అవార్డును ఆయన స్వయంగా అక్కడికి వెళ్లనందున ఆదివారం రాష్ట్ర మెడికల్ కౌన్సిల్ ఛైర్మన్ డాక్టర్ సాంబ శివరెడ్డి పాల్గొన్నారు. ఈ సమావేశంలో ఐఎంఎ రాష్ట్ర అధ్యక్షులు అనంతపురం సమావేశ కార్యనిర్వాహకులు ఐఎంఎ రాష్ట్ర మాజీ అధ్యక్షులు, కార్యదర్శి డాక్టరన బాలమద్దయ్య, హరికుమార్‌రెడ్డి, త్యాగరాజురెడ్డి, డి.సాయి ప్రసాద్, డీన్ రాయపు రమేష్ బాబు, రాష్ట్ర కోశాధికారి డాక్టర్ రవీంద్రనాథ్, డాక్టర్ ఎన్‌వీకే ప్రసాద్‌రెడ్డి, మాజీ రాష్ట్ర అధ్యక్షులు మెడికల్ కౌన్సిల్ సభ్యులు, డాక్టర్ మనోరంజన్‌రెడ్డి, రాష్ట్ర ఉపాధ్యక్షులు, రాష్ట్ర మహిళ అధ్యక్షులు హేమలత పాల్గొన్నారు.

## ఆకాశగంగ బాల ఆంజనేయ దర్శనంలో

### సిఎస్ డాక్టర్ జవహర్‌రెడ్డి



తిరుమల, జులై 16ప్రభాతవార్తప్రతినిధి: ఆకాశగంగ ప్రాంతంలో వెలసిన బాల ఆంజనేయస్వామి, అంజనాదేవి ఆలయాలను ఆదివారం ఉదయం ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డాక్టర్ కెఎస్ జవహర్‌రెడ్డి దర్శించుకున్నారు. టిటిడి ఇఒ ఏవి ధర్మారెడ్డితో కలసి ఇక్కడ ప్రత్యేక పూజలు చేశారు. జరుగుతున్న అభివృద్ధి పనులపై ఆరా తీశారు.

## సిఎంను కలసిన నారాయణ గురుకుల్ ట్రస్టు సాధువులు



శ్రీకాళహస్తి, జూలై 16 ప్రభాతవార్త : శ్రీకాళహస్తి పుణ్యక్షేత్రంలోని ఏర్పేడు మండలం వికృతమాల వద్ద జాతీయ స్థాయిలో పేరొందిన స్వామి నారాయణ గురుకుల్ ట్రస్టు సారధ్యంలో ఏర్పాటు చేయనున్న గురుకులం ఏర్పాటుకు సంబంధించిన ఏర్పాట్లు చక చకా సాగుతున్నాయి. మాజీ కేంద్ర మంత్రి జలగం ప్రసాద్‌రావు సారధ్యంలో ఈ ఏర్పాటు జరుగుతున్నాయి. గురుకులం ఏర్పాటుకు సంబంధించి ప్రధాన స్వామిజీ మహంతు సాధు దేవప్రసాద్ దాస్ స్వామి సారధ్యంలో వారిశిష్య బృందం ఆదివారం ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. రాష్ట్రంలోని విశాఖ పట్టణం, పులివెందుల, శ్రీకాళహస్తి నియోజకవర్గంలోని వికృతమాల వద్ద ఒక్కొక్క చోట 15 ఎకరాల స్థలాన్ని ప్రభుత్వం మంజూరు చేసింది. ఈ నేపధ్యంలో ముఖ్యమంత్రిచే భూమి పూజ చేయటానికి సన్నాహాలు జరుగుతున్నాయి. ట్రస్టుకు సంబంధించిన సాధువులు శుక్ల వల్లభదాస్, సాధు నిత్యస్వరూపాదాస్ తదితరులు సిఎంను కలిశారు.

## నియోజకవర్గం పరిశ్రమలతో అభివృద్ధి : బియ్యపు



శ్రీకాళహస్తి, జూలై 16 ప్రభాతవార్త : శ్రీకాళహస్తి నియోజకవర్గంలో విదేశాల నుంచి పరిశ్రామికులను ఆహ్వానించి ఇక్కడ వెసులుబాటు కల్పిస్తామని అమెరికాలోని ఔత్సాహికులను ఆహ్వానించినట్లు శాసనసభ్యుడు బియ్యపు మదుసూదనరెడ్డి అన్నారు. అమెరికా తానా సభలకు హాజరై తిరిగి వచ్చిన ఆయన ప్రభాతవార్తతో మాట్లాడుతూ శ్రీకాళహస్తి నియోజకవర్గంలోని ఏర్పేడు మండలం పరిశ్రమలకే కాకుండా ధార్మిక సంస్థలు ఏర్పాటు చేసే విద్యాసంస్థల ఏర్పాటుకు కూడా ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి చేయూత ఇస్తున్నారని మధుసూధనరెడ్డి అన్నారు. తాను పది రోజుల పాటు అమెరికాలు ఉన్నపుడు పలువురు పెద్ద పారిశ్రామిక వెత్తలను కలసి శ్రీకాళహస్తి నియోజకవర్గ అభివృద్ధి ఇక్కడ వాతావరణం, వివరించాననార్నారు. పరిశ్రమలు వస్తే నియోజకవర్గంలోని యువతీయువకులకు ఉపాధి అవకాశాలు వస్తాయనే ఆశతో వారిని ఆహ్వానించా మన్నారు. శ్రీకాళహస్తి మండలంలోని భారీ పరిశ్రమలు, ఆపాచి ఏర్పాటుకు సంబంధించి ఆకర్షితులయ్యారని వివరించారు. దాంతో ఇక్కడ పెట్టుబడులు పెట్టడానికి ముందుకు వస్తున్నారని మధుసూధనరెడ్డి వివరించారు. అంతేకాక ఏర్పేడు మండలంలో స్వామి నారాయణ గురుకుల్ ట్రస్టు సారధ్యంలో గురుకులాన్ని సుమారు రూ.100కోట్ల పెట్టుబడితో ఏర్పాటుకు ముందుకు వచ్చారని వారికి వికృతమాల వద్ద ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి ఆదేశాలతో 15 ఎకరాల స్థలాన్ని కేటాయించినట్లు వివరించారు. ఓ వైపు ఆధ్యాత్మిక చింతన మరో వైపు సంప్రదాయ విద్యాలయాలకు ప్రోత్సహిస్తున్నట్లు వివరించారు. స్థానిక పేద విద్యార్థులకు గురుకులంలో అవకాశం కల్పించబడు తుందని ఎంఎల్ఏ వివరించారు. తనను అత్యధిక ఓట్ల మెజారిటితో గెలిపించిన ప్రజలకు సేవలందించటమే లక్ష్యంగా పని చేస్తున్నామని వివరించారు. జాతీయ ప్రధాన కార్యదర్శి స్వామీజి మహంతు సాధు దేవప్రసాద్‌దాస్ స్వామి పరిశీలించారన్నారు. ఈ గురుకులాన్ని త్వరలో ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి శంకు స్థాపన చేయనున్నారని మధుసూధనరెడ్డి వివరించారు.

## వైద్య సేవలతో ఎంతో మందికి ప్రశాంతత

### -డాక్టర్ కృష్ణప్రశాంతి దంపతులకు సన్మానం



తిరుపతిటౌన్, జూలై16ప్రభాతవార్త: వైద్యసేవను వృత్తి, ప్రవృత్తిగా మలుచుకుని ఎంతోమంది రోగులకు తమదైన శైలిలో వైద్యసేవలందించి, ప్రశాంతత చేకూర్చి ప్రాణదానం చేసిన మహోన్నత వ్యక్తి డాక్టర్ క్రిష్ణప్రశాంతి అని రాయలసీమ రంగస్థలి చైర్మన్ గుండాల గోపీనాథ్‌రెడ్డి కొనియాడారు. ఆదివారం ఆయన డాక్టర్ క్రిష్ణప్రశాంతి, డాక్టర్ హరినాధ్‌రెడ్డి దంపతులను వారి గృహంలో కలసి దుశ్శాలువతో సత్కరించి అభినందించారు. రోగులకు వీరు చేస్తున్న సేవలు శ్లాఘనీయని కొనియాడారు. ఈ కార్యక్రమంలో రాయలసీమ రంగస్థలి కళాకారులు కార్యదర్శి కె ఎన్ రాజా, పొన్నాల జేజిరెడ్డి, సుబ్రమణ్యంయాదవ్, కల్యాణి, సుబ్రమణ్యంరెడ్డి, కొట్టేసుబ్రమణ్యంరెడ్డితదితరులు పాల్గొన్నారు.

### ఏడుకొండవాడికి ఏడవ నెలలో...

## ఏడు గంటల పాటు నృత్యనీరాజనం



తిరుమల, జులై 16ప్రభాతవార్తప్రతినిధి: కలియుగవైకుంఠం ఏడుకొండలపై ఏకధాటిగా ఏడు సంవత్స రాలుగా ప్రతి సంవత్సరం ఏడవనెలలో ఏడుగంటలు పాటు స్వామివారికి నృత్యనీరాజనం సమర్పిస్తున్నట్లు నిర్వాహకుడు డాక్టర్ పల్లంశెట్టిసురేష్ తెలిపారు. తిరుమలలోని అస్థానమడపంలో మూడు రోజులు పాటు జరిగే జాతీయ నృత్యోత్సవాలు ఆదివారం ఉదయం ప్రారంభమయ్యాయి. ఈ నృత్యోత్సవాలు సాయి నాట్యాంజలి ఫైనాన్స్ డెవలప్‌మెంట్ అసోసియేషన్ నంద్యాల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నట్లు నిర్వాహకుడు డాక్టర్ పల్లంశెట్టిసురేష్ వివరించారు. ఏడుగంటల పాటు ఏడుమంది గురువులను సత్కరిస్తూ 700మంది కళాకారులతో ఏడుకొండలవానికి నాట్యనీరాజనం అర్పించారు. తొలిరోజు ఆదివారం ఉదయం వేడుకగా ఆరంభమైన ఈ నృత్యోత్సవాల్లో గురువులు శ్రీనివాసవరప్రసాద్, సంధ్యాదేవి, కీర్తన, మహేశ్, ఐశ్వర్యరెడ్డి, రేణుక ప్రభాకర్, (కూచిపూడి), నలిని (భరతనాట్యం), అంగుస్మన్ (కథాకళి), రీమిటాపాల్ (ఒడిసినృత్యం), అనితమండల్, అంకిత భాసక్(మణిపురి), చంద్రశేఖర్ పేర్నినాట్యం, సంతనిబైన్ (మణిపురి) తదితర కళాకారులు పాల్గొన్నారు. నృత్యోత్సవాలు ఆహుతులను అలరించాయి.

## జనసేన నాయకులకు పరామర్శ



శ్రీకాళహస్తి, జూలై 16 ప్రభాతవార్త : జనసేన పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సత్య నారాయణ ఆదివారం విచ్చేశారు. ఈసందర్భంగా ఇటీవల చోటుచేసుకున్న సంఘటన నపై నాయకుడు కొట్టేసాయిపై పోలీస్ స్టేషన్‌లో సిఐ అంజూయాదవ్ చేయిచేసుకున్న సంఘటన విదితమే. ఈనేపధ్యంలో ఆయన కొట్టేసాయి కుటుంబ సభ్యులను పరామర్శించారు. సిఐ అంజూయదవ్ జనసేన పార్టీ నాయకులపై కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతుందని గతంలో కూడా జడ్పీటిసి ఎన్నికల్లో నగరం వినుత ఇంటిపై దాడిచేసి కేసులు నమోదు చేసి చిత్రహింసలకుగురిచేశారన్నారు. అదేవిధంగా నేడు పట్టణంలో నిరసన తెలుపుతున్న తమ కార్యకర్తపై దాడిచేయడం హేయమైన చర్య అని పార్టీ కార్యకర్తలపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులు నమోదు చేయడం పోలీసులకు పరిపాటిగా మారిందన్నారు. కేవలం జనసేన పార్టీ నాయకులకు మాత్రమే చట్టాలు వర్తిస్తాయని పవన్‌కళ్యాణ్ దిష్టిబొమ్మను దగ్ధం చేసినపుడు ఎక్కడా కూడా ఎలాలంటి కేసులు నమోదు కాలేదనారు. పవన్‌కళ్యాణ్ శ్రీకాళహస్తికి వస్తారా అన్న ప్రశ్నకు ఆయన బదులిస్తూ ఇప్పటి వరకు అధికారులు అనుమతి ఇవ్వలేదని ఏది ఏమైనా రేపు తిరుపతికి చేరుకుని ఎస్పీకి సిఐపై వినతిపత్రం ఇవ్వనున్నారన్నారు. కార్యక్రమంలో జనసేన పార్టీ నాయకులు కోటా వినుత, కోటచంద్రబాబు, కొట్టేసాయి, మహేష్, కుమార్, గణేష్ తదితరులు పాల్గొన్నారు. కాగా బిజెపి పార్టీ నాయకులు కూడా కొట్టేసాయిని పరామర్శించారు.

## మాతమ్మ ఆలయానికి వల్లీ లక్ష రుపాయలు విరాళం



తిరుపతిరూరల్, జూలై16 ప్రభాతవార్త: మాతమ్మ ఆలయానికి వక్స్‌బోర్డు కరమల్ల వల్లీ లక్ష రుపాయాలు విరాళం అందజేసి దాతృత్వానికి చాటుకున్నారు. తిరుపతిరూరల్ మండలం కుంట్ర పాకం గ్రామ పంచాయతీ పరిధి హరిజనవాడలో మాతమ్మ తిరునాళ్లు వైభవంగా నిర్వహిస్తున్నారు. మాతమ్మ తిరునాళ్ళు భాగంగా పంచాయతీ పరిధిలోని నాగూరు కాలనీకి చెందిన వైకాపా నేత, వక్స్‌బోర్డు డైరెక్టర్ కరమల్ల వల్లీ లక్షరుపాయాల విరాళాన్ని ఆలయ ధర్మకర్తలకు అందజేసారు. మాతమ్మ ఆలయ అభివృద్దికి తమవంతు సాయం అందిస్తానని తెలిపారు. లక్షరుపాయాలు విరాళం అందించిన కరమల్ల వల్లీకి మాతమ్మ ఆలయ ధర్మకర్తలు కృతజ్ఞతలు తెలిపి, ఆలయ అభివృద్దికి, ఉత్సవాల నిర్వాహణకు ఉదార స్వాభావంతో పెద్దఎత్తున విరాళం అందించిన వల్లీకి మాతమ్మ ఆశీస్సులు ఉంటాయని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో కుంట్రపాకం గ్రామ సర్పంచ్ రాచపాళ్యం శుభపద్మనాభరెడ్డి తదితరులు పాల్గొన్నారు.